సాక్షి విశాఖపట్నం

సోమవారం । 11 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకట కుమారి

గోపాలపట్నం: నేవీ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆదివారం విశాఖ వచ్చిన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.30 విశాఖ వచ్చిన ఆయన ఐఎన్‌ఎస్ డేగాలో దిగారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, డీసీపీ ఆనంద్‌రెడ్డి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో నగరానికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని సాయంత్రం 7.30 గంటలకు ఆయన విజయవాడ తిరిగి ప్రయాణమయ్యారు.

టైకూన్ కూడలి పునరుద్ధరణపై గతంలోనే లేఖ అందజేశా..

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఎంవీపీకాలనీ: సిరిపురంలోని టైకూన్ కూడలిని పునరుద్ధరించాలని గతంలోనే నగర పోలీసు ఉన్నతాధికారులకు లేఖ అందజేసినట్లు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కూడలి మూసివేతపై పలు ఆరోపణలు చేస్తూ కొన్ని రాజకీయ పార్టీలు నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ కూడలి మూసివేతలో తనకు గాని, తన సంస్థలకు గాని ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా నగర పోలీసులు ఆ కూడలిలో రాకపోకలను పునరుద్ధరించి ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలన్నారు. గతంలో మాదిరిగా యథావిధిగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలన్నారు.

జూకి రూ 7.89 లక్షల ఆదాయం



జూలో సందర్శకులు

ఆరిలోవ: కార్తీకమాసం ఆఖరి ఆదివారం జూ పార్కు సందర్శకులతో కిటకిటలాడింది. నగరంలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు జూను సందర్శించి.. రోజంతా సరదాగా గడిపారు. పిల్లలు, పెద్దలు, పాఠశాల విద్యార్థులు ఇక్కడ పిక్నిక్‌లు జరుపుకున్నారు. పులులు, సింహాలు, ఏనుగులు, కోతులు, చింపాజీలు, ఎలుగుబంట్లు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం ఒక్క రోజు 10,109 మంది జూను సందర్శించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా రూ 7.89 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆమె వెల్లడించారు.

14న అప్పన్న దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం ఈ నెల14న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 27 అంశాలతో రూపొందించిన అజెండాను ట్రస్ట్‌బోర్డు సభ్యులకు అధికారులు పంపించారు. శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి సమావేశం నిర్వహించనున్నారు. ఈసారి కూడా ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన అంశాలే ఎక్కువగా అజెండాలో పొందుపరిచారు. అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మ ఆలయాన్ని రూ.35 లక్షలతో అభివృద్ధి చేసే ప్రతిపాదనను అజెండాలో పెట్టారు.

నేడు జీవీఎంసీలో 'స్పందన' రద్దు

వాహనాలకు అనుమతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం కారణంగా సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది వాహనాలను అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగా స్పందన జరుగుతుందని, కాలుష్య నియంత్రణలో భాగంగా ఎటువంటి వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

సాగరంలో సంబరం



యుద్ధ విమానాలు



ఆయిల్ రిగ్‌కు బాంబు పెట్టి తిరిగి వెళ్తున్న మార్కోస్



విన్యాసాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న నగర ప్రజలు





జనగణమన ఆలపిస్తున్న గవర్నర్ నజీర్, మంత్రులు రజని, అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున

- అబ్బురపరిచిన నేవీ విన్యాసాలు
- పరాక్రమాన్ని చూపిన తూర్పు నావికాదళం
- ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నజీర్
- సందర్శకులతో కిటకిటలాడిన ఆర్.కె.బీచ్

బీచ్‌రోడ్డు: సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగనతలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రుమూకలపై మార్కోస్ ఉప్పెనలా దాడి.. దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా ఆర్.కె.బీచ్ రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలు.. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. నింగి, నేలా తేడా లేదనేలా సాగిన విన్యాస ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు.. సరికొత్త అనుభూతిని పొందారు. నేవీ డే పురస్కరించుకుని ఆర్.కె.బీచ్‌లో ఆదివారం జరిగిన తూర్పు నౌకాదళ విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ముందుగా సభా వేదిక వద్ద ముఖ్య అతిథులు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లను తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ స్వాగతం పలికారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేలా మూడు బాంబులను పేల్చి విన్యాసాలను ప్రారంభించారు.

కిటకిటలాడిన తీరం: నేవీ విన్యాసాలు చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజలు లక్షలాదిగా తరలిరావడంతో తీరంలో పండగ వాతావరణం నెలకొంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. తీరంలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.



బోట్లపై తీరానికొస్తున్న మార్కోస్

పటిష్ట ఏర్పాట్లతో విజయవంతం

లక్షలాది మంది ప్రేక్షకులు విన్యాసాలను చూసేందుకు వస్తారని అంచనా వేసిన అధికారులు, పోలీసులు అందుకు తగ్గట్లుగా భారీ ఏర్పాట్లు చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా గ్యాలరీలను ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించారు. విన్యాసాలను చూసేందుకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు.



బాంబులను జారవిడుస్తున్న విమానం



తీరంలో హెలికాప్టర్ల విన్యాసాలు



దూసుకొస్తున్న హాక్స్



జనసంద్రంగా సాగరతీరం







బాంబు పెట్టి ఆయిల్ రిగ్‌ను పేల్చిన మార్కోస్



స్కై డైవ్ చేస్తున్న సైనికుడు



ప్రజలను బంధించిన ఉగ్రవాదులు



నేవీ విద్యార్థుల నృత్య ప్రదర్శన



విన్యాసాలు తిలకిస్తున్న నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

ప్రదర్శన సాగిందిలా..

- సముద్రం నుంచి తీరం వైపునకు ఐదు హాక్స్ యుద్ధ విమానాలు దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించాయి.
- నిశ్శబ్దంగా దూసుకొచ్చిన ఐఎన్ఎస్ సింధుశాస్త్ర సబ్‌మెరైన్ నుంచి సెయిలింగ్ పాస్ట్ నిర్వహించారు.
- ఆయిల్ రిగ్‌ను పేల్చేందుకు ఓ హెలికాప్టర్‌లో మార్కోస్ వచ్చి తాడు సాయంతో చిన్న బోట్లలోకి దిగారు. అనంతరం రిగ్‌కు బాంబులు అమర్చారు. మళ్లీ హెలికాప్టర్ ఎక్కి రిమోట్ ద్వారా ఆయిల్ రిగ్‌ను పేల్చి.. సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించారు.
- ఉగ్రవాదుల వద్ద బందీగా ఉన్న ప్రజలను రక్షించే ప్రదర్శన ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది. మార్కోస్ ఉగ్రవాదులపై విరుచుకుపడి ప్రజలను రక్షించారు.
- రెండు యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై దాడి చేసిన విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి.
- యుద్ధం జరిగే సమయంలో నౌకలపై అత్యవసరంగా హెలికాప్టర్లను ఎలా ల్యాండ్ చేస్తారో చేసి చూపించారు. కదులుతున్న మూడు నౌకలపై మూడు హెలికాప్టర్లను విజయవంతంగా ల్యాండ్ చేశారు. అనంతరం యుద్ధ నౌకల నుంచి రాకెట్లను ప్రయోగించారు.
- ప్రమాదవశాత్తూ సముద్రంలో చిక్కుకున్న వారిని మూడు చేతక్ హెలికాప్టర్లపై సైనికులు వచ్చి రక్షించిన ప్రదర్శన అద్భుతంగా సాగింది.
- అనంతరం తూర్పు నావికాదళానికి చెందిన ఆయుధ సంపత్తిని ప్రదర్శించారు. గగనతలంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు చేసి విన్యాసాలను సందర్శకులు కళ్లార్పకుండా చూశారు.
- నేవీ బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది. చివరిగా యుద్ధ నౌకల్లో విద్యుత్ దీపాలను వెలిగించి విన్యాసాలు ముగించారు.

నేడు జీవీఎంసీ కౌన్సిల్

18 అజెండా, 27 సప్లిమెంటరీ అంశాలపై చర్చ



డాబాగార్డెన్స్: మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న జీవీఎంసీ సర్వసభ్య సమావేశానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 6వ తేదీన కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా.. మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా పడింది. ఆ రోజు వాయిదా పడ్డ 18 అంశాలతో పాటు మరో 27 అంశాలు నేడు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

- 2023–24 ఏడాదిలో డిసెంబర్ 13 నుంచి మార్చి 31, 2024 వరకు జోన్–4 టౌన్‌కొత్తరోడ్డు వద్ద గల సీసీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణలో భాగంగా అద్దె ప్రాతిపదికన టిప్పర్లు, బ్యాక్ హోయ లోడర్‌కు పరిపాలన ఆమోదం, ఎన్‌బీసీ, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణపు మార్గదర్శకాలకు అనుగుణంగా అంచనా విలువ రూ.99.47 కోట్లతో ముడసర్లోవలోని 4.37 ఎకరాల్లో జీవీఎంసీ నూతన ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వ పరిపాలన ఆమోదానికి సభ్యులు చర్చించనున్నారు.
- సాగర్‌నగర్‌కు ఎదురుగా బీచ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న బీచ్ స్థలంలో ఎకో ఫ్రెండ్లీ తాబేలు బీచ్ అభివృద్ధి, ఉద్యానవన విభాగంలో గ్రీనరీ అభివృద్ధి, పర్యవేక్షణకు కాంట్రాక్ట్ పద్ధతిలో 8 మంది జోనల్ హార్టికల్చర్ అధికారుల నియామకం, పూర్ణామార్కెట్ జంక్షన్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ వరకు రూ.1,34,02,077 అంచనా విలువతో రోడ్డుకిరువైపులా ఉన్న 55 ఫీడర్ పిల్లర్ బాక్స్‌లు, భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటుపై చర్చించనున్నారు.
- రూ.1,46,45,690 అంచనా విలువతో రీడింగ్ రూమ్ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ జంక్షన్ వరకు 69 ఫీడర్ పిల్లర్ బాక్స్‌లు, భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు, రూ.62,01,254 అంచనా విలువతో చౌల్ట్రీ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ జంక్షన్ వరకు 21 ఫీడర్ పిల్లర్ బాక్స్‌లు, భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు అంశాలు చర్చకు రానున్నాయి.
- పెదగదిలి జంక్షన్ వద్ద తూర్పు దిక్కున రూ.1.72కోట్లతో వంతెన నిర్మాణం, పడమర వైపున రూ.1.73 కోట్లతో వంతెన నిర్మాణం, కొత్త గాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్(కణితి రోడ్డు) వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో బీటీ హాట్ మిక్స్ రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ పనులు, హైటెన్షన్ విద్యుత్ స్తంభాల మార్పుపై చర్చించనున్నారు.
- గుండాల జంక్షన్ వద్ద రూ.1,98,90,000తో జీ+2 తరహాలో జీవీఎంసీ గెస్ట్‌హౌస్ నిర్మాణం, పెందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు హాట్‌మిక్స్‌తో బీటీ రోడ్డు పునరుద్ధరణ, పీఎఫ్ కాలనీలో బీటీ రోడ్డు పునరుద్ధరణ, 96వ వార్డు వేంకటేశ్వరస్వామి ఆలయ ఘాట్‌రోడ్డు హాట్‌మిక్స్‌తో బీటీ రోడ్డు పునరుద్ధరణ, 95వ వార్డు పురుషోత్తపురం వద్ద గల మహతి స్కూల్ నుంచి కంఫర్ట్ హోమ్స్ వరకు బీటీ రోడ్డు తదితర అంశాలను చర్చించి ఆమోదించనున్నారు.
- 90, 91, 92 వార్డుల్లో గిరి ప్రదక్షిణ రోడ్డు విస్తరణ, సెంటర్ డివైడర్లు, ఆర్‌సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం, సమగ్ర మొబిలిటీ ప్లాన్ తయారీ, సీఎం ఈ–బస్ సేవా పథకం, మధురవాడ, పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లు, గృహ అవసరాలకు 66 ఎంఎల్‌డీ నీటి సరఫరా, పంపిణీ, ముడసర్లోవలో నీటి శుద్ధి కర్మాగారం నిర్మాణంతో పాటు కేబీఆర్ నుంచి ట్రాన్స్‌మిషన్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు షరతులతో కూడిన విస్కో ప్రాజెక్ట్స్ తదితర అంశాలపై సభ్యులు చర్చిస్తారు.

అనంతుని దీపోత్సవం.. సర్వపాపహరణం

- పద్మనాభుని దీపోత్సవానికి సర్వం సిద్ధం
- రేపు సాయంత్రం 5.30 గంటలకు దివ్య వెలుగులు

పద్మనాభం: భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అనంత పద్మనాభుని దీపోత్సవం రానే వచ్చింది. ఈ నెల 12వ తేదీన ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ ఉత్సవాన్ని కనులారా వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఒకే చోట శైవ, వైష్ణవ ఆలయాలు ఉండడం పద్మనాభం ఆలయ ప్రత్యేకత. అనంత పద్మనాభుని ప్రాచీన దేవాలయాలు భారతదేశంలో రెండు చోట్ల ఉన్నాయి. ఒకటి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలోను, రెండోది పద్మనాభం గ్రామంలోని గిరిపై ఉంది. ఎక్కడా జరగని రీతిలో ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున అనంత పద్మనాభుని కొండ మెట్ల పంక్తిపై దీపాలంకరణ ఉత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీ. గిరి పాదం నుంచి గిరి శిఖరం వరకు 1,288 మెట్లు కిరువైపులా తైల దీపాలంకరణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తూ హైందవ సంప్రదాయ విశిష్టతను ఎల్లెడెలా వ్యాపింపజేస్తున్నారు. స్వామి దీపోత్సవంలో పాల్గొంటే సర్వపాపహరణం, స్వర్గలోకం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. మహిళలు తాము పుణ్యవతులు కావడానికి కార్తీక దీపోత్సవంలో పాల్గొనడమే ఉత్తమని భావిస్తారు. అందుకే దీపోత్సవం రోజు మధ్యాహ్నమే వీరు పద్మనాభం చేరుకుని దీపాలు వెలిగించడానికి కొండ మెట్లను పోటీ పడి మరి రిజర్వు చేసుకుంటారు. ఉత్సవం మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. గిరిపైన జేగంట మోగగానే భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంత పద్మనాభుడు గిరి దిగువున ప్రథమ పావంచా వద్ద కొలువు దీరుతారు. గిరిని అధిరోహించే ముందు భక్తులు ప్రథమ పావంచా వద్ద కొలువై ఉన్న స్వామిని దర్శించుకుంటారు. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



అనంతుని మెట్లు (ఇన్‌సెట్) స్వామి ఉత్సవ విగ్రహాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి చొరవతో..

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం అనంతుని దీపోత్సవానికి రూ.8లక్షలు కేటాయించింది. సింహాచలం దేవస్థానం అధికారుల సహకారంతో దీపోత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే గిరిపై ఉన్న ఆలయానికి, గిరి మెట్లకు, గిరి దిగువున ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయానికి సున్నం వేశారు. మెట్లు కిరువైపులా తుప్పలు, డొంకలు తొలగించారు. దీపాలు వెలిగించడానికి అవసరమయ్యే 14 డబ్బాల నూనె, ఐదు వేల ప్రమిదలు, ఐదు వేల ఒత్తులు సమకూర్చారు. మెట్ల మార్గంతో పాటు ఘాట్ రోడ్డుపై నుంచి కొండ మీదకు వెళ్లడానికి, దిగడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఘాట్ రోడ్డు పక్కన విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

విశాఖపట్నం వచ్చే భక్తులు సింహాచలం, ఆనందపురం, తగరపువలస మీదుగా పద్మనాభం చేరుకోవచ్చు. విశాఖ నుంచి 222కే బస్సు ఉంది. ఇది తగరపువలస మీదుగా పద్మనాభం వస్తుంది. తగరపువలస, ఆనందపురం నుంచి ఆటోల్లో రావచ్చు. సింహాచలం, విజయనగరం నుంచి ప్రతి పది నిమషాలకు పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. సింహాచలం ఆర్‌టీసీ డిపో ప్రత్యేక బస్సులు నడపనుంది.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం

సింహాచలం: స్వాతి నక్షత్రం సందర్భంగా సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమం ఘనంగా జరిగింది. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు అందుబాటులో ఉంచడంతో ఈసారి పెద్ద ఎత్తున ఉభయదాతలు హోమంలో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమ గుండం వద్ద అధిష్టింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం జరిపారు. అనంతరం నృసింహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశను ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశా రు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ రాజశేఖర్ హోమాన్ని తిలకించారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్, జస్టిస్ సుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసమూర్తి

క్లుప్తంగా

పలు మార్గాల్లో వన్‌వే స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో వన్‌వే ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. రంగపర నార్త్ –సికింద్రాబాద్(02605) వన్‌వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రంగపర నార్త్‌లో ఈ నెల 17 సాయంత్రం ఆరు గంటలకు బయల్దేరి మంగళవారం తెల్లవారు 2 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 2.20 గంటలకు బయల్దేరి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ 1–సెకండ్ ఏసీ , 5–స్లీపర్‌క్లాస్, 9–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కం లగేజీ/దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

పూరి–అహ్మదాబాద్ వన్‌వే స్పెషల్

పూరి – అహ్మదాబాద్ (08419) వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 9.50గంటలకు పూరిలో బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35గంటలకు బయల్దేరి మంగళవారం అర్ధరాత్రి(బుధవారం తెల్లవారు) 1.30 గంటలకు అహ్మదాబాద్ చేరుకుంటుంది.

బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స



చికిత్స పొందిన బాలుడితో వైద్యులు

ఎంవీపీ కాలనీ: పొడి దగ్గు, ఛాతీ నొప్పితో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడికి విశాఖ మెడికవర్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సుధీర్ తలే నేతృత్వంలోని వైద్యులు బృందం అందించిన ఈ చికిత్స వివరాలిలా ఉన్నాయి. చికిత్స కోసం వచ్చిన బాలుడికి డాక్టర్ సుధీర్ తలే ఎక్స్‌రే చేయించగా.. ఎడమ ఊపిరితిత్తులలో కణితి ఉందని గుర్తించారు. దీంతో రోగికి ఇన్ఫ్లమేటరీ మైయోఫైబ్రోబ్లాస్టిక్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారించారు. కణితి తొలగించేందుకు పల్మొనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే నేతృత్వంలోని ఇతర వైద్యుల బృందం అధునాతన బ్రోంకోస్కోపీ, కాటేరీ వైద్య ప్రక్రియలను వినియోగించారు. ఊపిరితిత్తుల పనితీరును సక్రమంగా పునరుద్ధరించడంతో రోగి పూర్తిగా కోలుకున్నాడు. చికిత్స విజయవంతం కావడంతో వైద్యుల బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పెల్ బీ,మ్యాథ్ బీకి విశేష స్పందన

- అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు
- పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు

SAKSHI MATH BEE 2023-24 SAKSHI SPELL Bee 2023-24



మ్యాథ్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన మాథ్స్ బీ, స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో గల శ్రీ విశ్వ పాఠశాలలో జరిగిన పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా చేసి, మొదటిగా మ్యాథ్స్ బీ, ఆ తరువాత స్పెల్ బీ పరీక్ష నిర్వహించారు. మ్యాథ్స్ బీ సెమీఫైనల్ కాగా, స్పెల్ బీ క్వార్టర్ ఫైనల్ స్థాయిలో జరిగింది. వివిధ స్థాయిల్లో ఇప్పటికే జరిగిన పరీక్షల్లో ప్రతిభ చాటిన విదార్థులు పాల్గొన్నారు. ఇక్కడ సత్తా చాటిన విద్యార్థులు ఫైనల్‌కు వెళ్లనున్నారు. పోటీతత్వాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న పరీక్ష కావటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్షపై ఎంతో ఆసక్తి కనబరిచి, వారే స్వయంగా తమ పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి.

పిల్లలకు ఎంతో ఉపయోగం



మా అమ్మాయి రెండో తరగతి చదువుతోంది. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించాం. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– సింగంపల్లి నిరీషా

పోటీ పరీక్షలంటే ఇష్టం



పోటీ పరీక్షలు రాయటం అంటే ఎంతో ఇష్టం. సాక్షి స్పెల్ బీ పరీక్షను రెండో తరగతిలో ఉన్నప్పుడు రాశాను. ఫైనల్‌కు వరకు వెళ్లాలనే లక్ష్యంతో ఇప్పుడు బాగా సిద్ధమయ్యాను. స్పెల్ బీ పరీక్ష రాసేందుకు మా టీచర్లు ప్రోత్సహించారు.

– దాడి ఇషిత, ఐదో తరగతి

పరీక్ష బాగా రాశాను



మ్యాథ్స్ బీ పరీక్ష బాగా రాశాను. సాక్షి ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు తరచూ పెడితే ఇంకా బాగుంటుంది. మా టీచర్లు పరీక్ష బాగా రాసేలా ఎంతో ప్రోత్సహించారు. క్లాసులో తోటి స్నేహితులతో కూడా దీనిపై చర్చించుకుంటాం.

– బొమ్మ భావన, 9వ తరగతి

కచ్చితంగా ఫైనల్‌కు వెళ్తా



మ్యాథ్స్ బీ, స్పెల్ బీ పరీక్షలపై మా స్కూల్లో టీచర్లు బాగా నేర్పించారు. ఇలాంటి పరీక్షలు రాయటం వల్ల పోటీతత్వం పెరుగుతుంది. స్కూల్లో ఎలాంటి పరీక్షల్లోనైనా మా క్లాసు నుంచి నేను పాల్గొంటాను. ఫైనల్‌కు వెళ్తాననే నమ్మకం ఉంది.

– జాజిమొగ్గల హారిక,8వ తరగతి

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ఈశ్వర్ కౌశిక్



జాతీయ పోటీలకు ఎంపికైన సుశ్రిత

విజయనగరం రూరల్: జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో గల ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. అండర్– 17 విభాగంలో విజయనగరానికి చెందిన రొంగలి సుశ్రితనాయుడు బంగారు పతకం సాధించడమే కాకుండా ఈ నెలలోనే గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్‌లు బహుమతులు ప్రదానం చేశారు.

రెడ్డి సామాజిక వర్గాన్ని ద్వేషించడం తగదు



మాట్లాడుతున్న ఓసీ సంక్షేమ సంఘం, రెడ్డి జేఏసీ నాయకులు

మహారాణిపేట: రెడ్డి సామాజిక వర్గాన్ని తెలుగుదేశం పార్టీ ద్వేషించడం మానకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఓసీ సంక్షేమ సంఘం, రెడ్డి జేఏసీ నాయకుడు జి.కరుణాకర రెడ్డి, వి.శివకుమార్ రెడ్డి హెచ్చరించారు. నగరంలో ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. టీడీపీతోపాటు కొన్ని పత్రికలు ఇటీవల రెడ్లపై విషం చిమ్ముతూ ఆరోపించడం తగదన్నారు. అభూత కల్పనలతో నిత్యం కట్టుకథలు అల్లడం తగదని వారు పేర్కొన్నారు. వాస్తవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇతర సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక న్యాయం పాటిస్తుంటే, టీడీపీ మాత్రం పోలీసు, రెవెన్యూ తదితర పదవుల్లో రెడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రచారం చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తమ సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చి రెడ్లను అణిచివేసినందు వల్లనే గత ఎన్నికల్లో టీడీపి నుంచి ఒక్క రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేకపోయారన్నారు. నిజాయతీ గల అధికారులు రితేష్‌రెడ్డి, అమ్మిరెడ్డి, పరమేశ్వరరెడ్డి, రవిశంకరరెడ్డి, మాధవరెడ్డి తదితర అధికారులకు కులం అంటగట్టడం సిగ్గుచేటని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సమర్థవంతులైన రెడ్డి అధికారులకు రెవెన్యూ,పోలీసు,మునిసిపల్ విభాగాల్లో ప్రాధాన్యం లేని పోస్టుల్లో నియమించి అవమానించారని కరుణాకరరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి, రెడ్డి జేఏసీ అధ్యక్షుడు వి.శివకుమార్ రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బోర కుమార్ రెడ్డి, ఇతర నాయకలు రౌతు భాస్కరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మరికొన్ని ఆక్రమణల తొలగింపు

- మధురవాడలో ఆర్‌సీసీ ఇల్లు, కాంపౌండ్ వాల్ తొలగింపు
- స్వాధీనం చేసుకున్న భూమి పరిరక్షణకు చర్యలు



రిక్షా కాలనీలో ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు



మధురవాడ రిక్షా కాలనీలో ఆక్రమిత స్థలంలోని ఇల్లును పొక్లెయిన్‌తో కూల్చివేస్తున్న అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడలో ఆదివారం రెండో రోజు కూడా ఆక్రమణల తొలగింపు పర్వం కొనసాగింది. మండల ఆర్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల సీవోఈ హాస్టల్‌ని ఆనుకుని ఉన్న ఆర్‌సీసీ బిల్డింగ్, అదే ప్రాంగణంలో ఉన్న మరో ప్రహరీ తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తంగా సుమారు రూ.8 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 6/1లో 18 సెంట్లు, 8/2లో 22 సెంట్ల ప్రభుత్వ గయాలు భూమి, 9/2లో వాగు పోరంబోకు భూమి 6 సెంట్లు కలిపి మొత్తంగా 46 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృష్ణమూర్తి, అనూష ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం గుర్తించిన విషయం తెలిసిందే.

ఆర్‌సీసీ బిల్డింగ్, ప్రహరీ తొలగింపు

ఇక్కడి ఆక్రమణదారులు ముందుగానే ప్రభుత్వ భూమిలో ఆర్‌సీసీ బిల్డింగ్, మరో రెండు షెడ్లు నిర్మించి, ఇంటి పన్ను, కరెంటు కనెక్షన్ కూడా పొంది ఆక్రమణను సక్రమం చేసుకునేందుకు పక్కా ప్రణాళిక రచించారు. అయినా వాటిని పట్టించుకోకుండా అధికారులు పక్కాగా ఆక్రమణలు తొలగించారు. సర్వే నంబరు 8/2లో ఉన్న రెండు గదుల డాబా ఇల్లుతోపాటు, ఇదే ప్రాంగణంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు, నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ వైపు సర్వే నంబరు 6/1లో 6 సెంట్లు స్థలంలో ఉన్న ప్రహరీని కూడా తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న భూమిని రక్షించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే రిక్షా కాలనీ నుంచి వసంత విహార్‌కి వెళ్లే మార్గంలో రోడ్డు స్థలంలో నిర్మించిన షెడ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సూర్యసత్య శ్రీనుబాబు, వీఆర్‌వో సూరిబాబు, పలువురు సచివాలయ వీఆర్‌వోలు, ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం అపార్ట్‌మెంట్...

సర్వే నంబరు 6/1లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో కూడా ప్రభుత్వ స్థలం ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే ఇక్కడ 46 సెంట్లలో ఆక్రమణలు తొలగించిన అధికారులు... ఇతర ఆక్రమణలపై కూడా దృష్టి సారించారు. 10 సెంట్లు పైనే ప్రభుత్వ గెడ్డ పోరంబోకు స్థలం కలిపి అపార్టుమెంట్ నిర్మించారని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

గోస్తనీ నదిలో విద్యార్థి గల్లంతు



హరి (ఫైల్)



రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి చెక్ డ్యామ్ వద్ద ఆదివారం స్నానానికి దిగిన ఇంటర్ విద్యార్థి గల్లంతైనట్టు ఎస్‌ఐ జె.సురేష్ తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పీఎం పాలెం గాయత్రినగర్‌కు చెందిన ఎనిమిది మంది మహిళలు, ఐదుగురు పురుషులు కలిసి ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆటోలో కురపల్లి పిక్నిక్‌కు వచ్చారు. వీరిలో పొన్నగంటి హరి (16)తోపాటు ముగ్గురు చెక్ డ్యామ్ వద్ద గోస్తనీ నదిలోకి స్నానానికి దిగారు. ఈ క్రమంలో హరి నదిలో గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు ఒడ్డుకు చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. విషయం తెలుసుకున్న పాండ్రంగి గ్రామానికి చెందిన జాలర్లు, కురపల్లి గ్రామస్తులు నదిలో హరి కోసం సాయంత్రం ఐదు గంటల వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గాయత్రినగర్‌కు చెందిన పొన్నగంటి అప్పారావు, రమణమ్మ దంపతులకు హరి, ఉదయ్ ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో రెండోవాడైన హరి మద్దిలపాలెం కృష్ణా కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఉదయ్ పాలిటెక్నికల్ చదువుతున్నాడు. తండ్రి అప్పారావు స్థానిక బీసీ హాస్టల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. హరి, ఉదయ్ చక్కగా చదువుకుని ప్రయోజకులై తమకు అండగా నిలుస్తారని ఆశపడితే, ఇలా గల్లంతయ్యాడని తల్లి రమణమ్మ, గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

వీధి కుక్కల దాడితో వృద్ధురాలి మృతి



శాంతమ్మ (ఫైల్)

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి ఎస్సీ కాలనీకి చెందిన పాట్నూరు శాంతమ్మ ఆదివారం తెల్లవారు జామున వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కోడలు దేవి తెలిపిన వివరాల ప్రకారం... శాంతమ్మ ఆదివారం తెల్లవారుజామున నిద్ర లేచి బయటకు వచ్చేసరికి వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. చీకటి కావడంతో చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. దీంతో తీవ్ర రక్తస్రావమైన శాంతమ్మ అక్కడికక్కడే మృతి చెందారు.

పాదయాత్రగా వెళ్లి..అనంతలోకాలకు..

- క్రేన్ ఢీకొని అయ్యప్ప స్వామి మాలధారుడి దుర్మరణం
- సింహాచలం వెళ్తుండగా ఘటన





ప్రమాదానికి కారణమైన క్రేన్(ఇన్‌సెట్) బెహరా మురళి(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అతను స్వామి అయ్యప్ప మాల వేశారు. ఎంతో నిష్ఠతో పూజలు చేస్తున్నారు. మాలలో ఉండగానే పాదయాత్రగా వెళ్లి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం పాదయాత్రగా సింహాచలం బయలుదేరిన ఆయన.. మార్గ మధ్యంలోనే దుర్మరణం పాలయ్యారు. క్రేన్ రూపంలో ఆయన్ని మృత్యువు కబళించింది. గాజువాక ట్రాఫిక్ ఎస్‌ఐ షేక్ యూసఫ్ తెలిపిన వివరాలివీ.. గాజువాక సింహగిరికాలనీకి చెందిన బెహరా మురళి(67) కోరమండల్‌లోని మణికంఠ కన్‌స్ట్రక్షన్‌లో సివిల్ కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవలే అతను స్వామి అయ్యప్ప మాల ధారణ చేశారు.

ఆదివారం ఉదయం సింహాచలం లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా బయలుదేరారు. పాతగాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చిన ఆయన.. చట్టివానిపాలెం, ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ మధ్యలో రోడ్డు పక్కన నడుస్తున్నారు. ఆ సమయంలో ఆటోనగర్ నుంచి వస్తున్న క్రేన్ మురళీని ఢీ కొట్టి అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ షేక్ యూసఫ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన నాతయ్యపాలేనికి చెందిన హైడ్రా క్రేన్ ఆపరేటర్ అక్కిరెడ్డి దేముడును అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, వివాహితులైన కుమారుడు సతీష్, కుమార్తెలు రమ, వరలక్ష్మి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యూసఫ్ తెలిపారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఘన స్వాగతం



సుభాష్ పార్ధికి స్వాగతం పలుకుతున్న ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ రామనాథ్ పార్ధికి స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. విశాఖలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న, తదితరులు శాలువా కప్పి, బొకే అందజేసి, ఆహ్వానం పలికారు. 12న స్టీల్‌ప్లాంట్, ఓఎన్‌జీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు, ఆయా సంస్థల యాజమాన్యాలతో సమావేశం కానున్నారు. స్వాగతం పలికిన వారిలో అసోసియేషన్ నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎల్.వి.రమణారావు, ఎస్.మోహన్‌బాబు, డి.పుల్లారావు, కె.వి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు పూయించిన ఎల్‌బీ శ్రీరామ్



మాట్లాడుతున్న సినీ నటుడు ఎల్‌బీ శ్రీరామ్

సీతమ్మధార : ప్రముఖ రచయిత, సినీనటుడు, నాటకకర్త, దర్శకుడు ఎల్‌బీ శ్రీరామ్‌తో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నవ్వులు పువ్వులు విరిశాయి. ఈ మేరకు ప్రముఖ అంతర్జాతీయ సాహిత్య సంస్థ నవసాహితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హోటల్ స్మార్ట్ ఇన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌బీ శ్రీరామ్ పాల్గొన్నారు. సాహిత్యపరమైన అంశాలతోపాటు రచయితగా, యూట్యూబర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. మరచిపోలేని సంఘటనలను ముఖాముఖిలో వివరించారు. ప్రముఖ నటుడు, సాహితీవేత్త గొల్లపూడి మారుతీరావు స్మారక పురస్కారం అందుకోవడానికి నగరానికి వచ్చిన ఆయన సాహితీవేత్తలు, పాత్రికేయులు, కళాకారులు అడిగిన ప్రశ్నలకు హుందాగా, చమత్కారంగా సమాధానం చెప్పి వేదికను ఆహ్లాదకరంగా మార్చారు. నవసాహితీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఏ.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకట సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి, యడవిల్లి సుధాకర్, అప్పారావు, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కోరుకొండ రంగారావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీ షాపింగ్ మాల్‌లో ఫెస్టివల్ ఆఫర్స్



ఫెస్టివల్ ఆఫర్స్ లాంచ్ చేస్తున్న ప్రముఖ సినీతార అనసూయ

దాబాగార్డెన్స్: క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని లక్కీ షాపింగ్ మాల్‌లో ఫెస్టివల్ ఆఫర్స్ అందుబాటులోకి వచ్చాయి. జగదాంబ షోరూమ్‌లో ఫెస్టివల్ ఆఫర్స్‌ను సినీతార అనసూయ భరద్వాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేతలు రత్తయ్య, శ్రీను, స్వామి మాట్లాడుతూ 12 ఏళ్లుగా విశాఖ నగర ప్రజలకు దగ్గరగా ఉన్నామని, ఈ సారి కూడా వుమెన్స్ వేర్, లేడీస్ వేర్, జెంట్స్ వేర్, కిడ్స్‌వేర్ ఇలా అన్ని విభాగాల్లో ఆఫర్స్ అందజేస్తున్నట్టు తెలిపారు. ఫెస్టివల్ సీజన్ పురస్కరించుకుని నగర ప్రజలకు అందుబాటు ధరల్లోనే అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

వెల్‌కమ్ డీర్

- జూకు కొత్త జంతువులొచ్చాయ్



మౌస్ డీర్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకు ఆదివారం కొత్త జంతువులు వచ్చాయి. కొద్దిరోజుల్లో ఇవి సందర్శకులను అలరించనున్నాయి. ఇటీవల ఇందిరాగాంధీ జూ పార్కు అధికారులు.. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో కాకతీయ జూ పార్కును సందర్శించారు. జంతు మార్పిడికి ఒప్పందం చేసుకుని.. అక్కడి నుంచి మూడు మౌస్ డీర్‌లు, మూడు చౌసింగ(నాలుగు కొమ్ముల జింక)లను ఆదివారం తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడి నుంచి మూడు హగ్ డీర్లు, మూడు బార్కింగ్ డీర్లు, నాలుగు లుటినో పారాకీట్లను కాకతీయ జూ పార్కుకు పంపించారు. కొత్తగా తీసుకొచ్చిన జంతువులను కొద్ది రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచి.. అనంతరం ఎన్‌క్లోజర్లలో విడిచిపెడతామని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ప్రస్తుతం ఇవి ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు.



చౌసింగ